# కచ్చితత్వం కోసమే పంటల సర్వే

- క్రాప్, పొలాల ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నం
- ఏఈవోలు ఫీల్డ్ విజిట్ చేస్తారు.. రైతులు సహకరించాలి
- డీఏవో శ్రీధర్... జమ్మికుంట మండలంలో పర్యటన

జమ్మికుంట, సెప్టెంబర్ 30: రైతులు పంటలు అమ్ముకునే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కచ్చితత్వం కోసమే పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని, ఈ ప్రక్రియకు రైతులు సహకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ కోరారు. శనివారం ఆయన జమ్మికుంట మండలంలోని మాచినపల్లి గ్రామాన్ని సందర్శించారు. పంటల సాగు వివరాలు నమోదు చేస్తున్న ఏఈవోలు, రైతులను కలిశారు. క్రాప్ వివరాల నమోదును పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఆయన కూడా పలువురు రైతులకు చెందిన పంటల వివరాల నమోదు చేశారు. తర్వాత డీఏవో మాట్లాడుతూ.. జిల్లాలో పంటల ఫొటో క్యాప్చరింగ్‌తో సర్వే చేపట్టడానికి జమ్మికుంటను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని వెల్లడించారు. ప్రత్యేక యాప్‌లో క్రాప్ వివరాలను


ఈ పోర్టల్‌లో పంట వివరాలు నమోదు చేస్తున్న డీఏవో శ్రీధర్

నమోదు చేస్తున్నామని చెప్పారు. క్రాప్ వివరాల నమోదు వల్ల ఎరువుల వాడకం, పంటల దిగుబడి తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అంతే కాకుండా ఏ సర్వే నంబరులో ఏ రైతు ఏ పంట సాగు చేస్తున్నారు.. తదితర వివరాలన్నీ తెలుస్తాయని పేర్కొన్నారు. యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసిన సంబంధిత వివరాలను ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిందని, రైతుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. క్రాప్ వివరాల నమోదును క్షేత్రస్థాయిలోకి వెళ్లి చేయాల్సిందేనని ఏఈవోలకు సూచించారు. క్రాప్ నమోదుకు సంబంధించిన సలహాలు, సూచనలు అందించారు. ఇక్కడ ఏఈవో లక్ష్మణ్, రైతులు, తదితరులున్నారు.

## రూట్‌మ్యాప్ అతిక్రమించిన 15 మంది అరెస్ట్

- నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీ
- ఆందోళన నిర్వహించిన వారిపై కూడా కేసులు
- సీపీ సుబ్బారాయుడు వెల్లడి


సీపీ సుబ్బారాయుడు

రాంనగర్, సెప్టెంబర్ 30: రూట్‌మ్యాప్ పరిమితిని అతిక్రమించి, పలు వీధిల్లో వాహనాలపై గుంపుగా ర్యాలీ నిర్వహించిన 15 మంది యువకులను అరెస్టు చేసినట్లు సీపీ సుబ్బారాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 29వ తేదీన మర్కజ్ మిలాద్ కమిటీ ర్యాలీకి అనుమతి కోరగా, పరిమితులతో కూడిన అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కానీ కొందరు యువకులు పోలీసులు ఇచ్చిన రూట్‌మ్యాప్ ప్రకారం కాకుండా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఆఫీస్ వీధిలో కూడా ర్యాలీగా వెళ్లారన్నారు. ఈ ఘటనపై బీజేపీకి చెందిన పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు.. ఎంఐఎం యువకులు ఎంపీ ఆఫీస్‌పై దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలను పరిశీలించి బాధ్యులను గుర్తించామని పేర్కొన్నారు. 15 మంది యువకులను గుర్తించి అరెస్టు చేశామని, వారి వాహనాలను కూడా సీజ్ చేసినట్లు చెప్పారు. కాగా, ఘటన జరిగిన వెంటనే పోలీసులు ఎంపీ కార్యాలయం వద్దకు చేరుకుని చర్యలు తీసుకుంటామని చెప్పినా వినకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆందోళన నిర్వహించి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన బీజేపీ నాయకులపై కూడా కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. అంతేకాకుండా సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేసిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఘటనపై సోషల్ మీడియాలో మత ఘర్షణలకు దారి తీసే విధంగా పోస్టులు పెట్టినా, దుష్ప్రచారం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ఎలాంటి ఘటన జరిగినా పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## కరెంట్‌షాక్‌తో గేదె మృతి


లక్ష్మీపూర్‌లో కరెంట్ షాక్‌తో మృతిచెందిన గేదెవద్ద విలపిస్తున్న మహిళారైతు

రామడుగు, సెప్టెంబర్ 30: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో మహిళా రైతు కొలిపాక లావణ్యకు చెందిన గేదె శుక్రవారం సాయంత్రం కరెంట్‌షాక్‌తో అక్కడికక్కడే చనిపోయింది. రోజులాగే శుక్రవారం లావణ్య తన పొలం సమీపంలో మేతకోసం గేదెను తాడుతో కట్టేయగా, గేదె తాడు తెంచుకొని పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన సపోటు తీగను తాకడంతో విద్యుత్ ప్రసరణ జరిగి మృత్యువాత పడింది. దీనిని గుర్తించిన లావణ్య కొడుకు మణిచంద్ వెంటనే విద్యుత్‌శాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో కరెంట్ సరఫరా నిలిపివేసి గేదెను తీగనుంచి తొలగించారు. విషయాన్ని మండల పశువైద్యాధికారికి తెలుపగా, పంచనామా చేసి ధ్రువీకరణ చేశారు. కాగా, కరెంట్‌షాక్‌తో మృతిచెందిన గేదె విలువ సుమారు రూ.40వేలు ఉంటుందని బాధిత మహిళారైతు ఆవేదన వ్యక్తం చేసింది.

## గట్టుదుద్దెనపల్లి ఆలయ హుండీ లెక్కింపు

మానకొండూర్ రూరల్, సెప్టెంబర్ 30: మండలంలోని గట్టుదుద్దెనపల్లి శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయ హుండీ లెక్కింపు శనివారం దేవాలయ ఆవరణలో నిర్వహించారు. భక్తుల కానుకల రూపంలో రూ. 2,28,213 నగదు వచ్చినట్లు ఆలయ ఈవో అనిల్‌కుమార్ తెలిపారు. అనంతరం ఆలయంలో, పరిసర ప్రాంతాల్లో కొబ్బరి కాయలు, పూజాసామాగ్రి విక్రయానికి సంబంధించి వేలం పాట నిర్వహించారు. కార్యక్రమంలో పర్యవేక్షకుడు సత్యనారాయణ, ఆలయ వ్యవస్థాపకులు ఆకుల గోపాల్ రావు, శంకర్ లింగం, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంపై అవగాహన

కలెక్టరేట్, సెప్టెంబర్ 30 : పోషణ్ అభియాన్ ముగింపు కార్యక్రమంలో భాగంగా, ఐసీడీఎస్ కరీంనగర్ అర్బన్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మంకమ్మతోట బాలికల పాఠశాలలో పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని చిలుముల ప్రమీల మాట్లాడుతూ, చిరుప్రాయం నుంచే పిల్లలకు తల్లిదండ్రులు బలవర్ధకమైన ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు కె.భాగ్యలక్ష్మి, ఆర్.కాత్యాయిని, ఎ.భాగ్యలక్ష్మి, ఆరోగ్య పరిశీలకుడు సురేందర్, శంకరయ్య, ఏఎన్ఎం ఉమాదేవి, భాగ్య, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

## జూట్, పేపర్ బ్యాగులనే వినియోగించాలి

గంగాధర, సెప్టెంబర్ 30: గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త, రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ పిలుపు మేరకు గంగాధర పోలీస్ స్టేషన్‌లో శనివారం ప్లాస్టిక్ నివారణపై ఎస్ఐ పుల్ల అభిలాష్ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువులను వినియోగించడం వల్ల కలిగే నష్టాలు వివరించి, జూట్, పేపర్ బ్యాగులను వినియోగించాలని సూచించారు. అనంతరం ప్రజలకు జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రీన్‌ఇండియా చాలెంజ్ ఇన్‌చార్జి గర్రెపల్లి సతీశ్, సర్పంచ్ వేముల దామోదర్, నాయకులు తోట మహిపాల్, ఠాగూర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


మధురానగర్ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

## భాస్కర్ భాయ్.. బాగున్నవా!

- మధురానగర్ గ్రామస్తులను ఆప్యాయంగా పలుకరించిన ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, సెప్టెంబర్ 30: బోయినపల్లి మండలంలో ప్రోగ్రాంలో పాల్గొని బూరుగుపల్లి వెళ్తుండగా గంగాధర మండల మధురానగర్ హనుమాన్ దేవాలయం వద్ద స్థానికులను చూసిన ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తన వాహనాన్ని ఆపి వారి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలుకరించారు. అక్కడే ఉన్న సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, గ్రామస్తులతో మాట్లాడారు. వేడివేడిగా మిరపకాయ బజ్జీలను తింటూ, చాయ్ తాగుతూ తనకు కూడా పత్తికుంటపల్లిలో ఇల్లు ఉందని, తానూ స్థానికుడినే అని గ్రామస్తులతో జ్ఞాపకాలను పంచుకున్నారు. చాయ్ బాగుందని హోటల్ నిర్వాహకుడు మల్లేశంను మెచ్చుకున్నారు. ఇక్కడ ఆత్మ చైర్మన్ తూం మల్లారెడ్డి, కాచిరెడ్డిపల్లి సర్పంచ్ జోగు లక్ష్మీరాజం, నాయకులు మధుసూదన్, సురేందర్, గంగాధర్, చందు, నారాయణ, శంకర్, రవి, తిరుపతి, భూపతి తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే సతీమణి ఔదార్యం

చొప్పదండి, సెప్టెంబర్ 30: మండలంలోని వెదురుగట్ట గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త రాజు అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యుల పరిస్థితిని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సతీమణి దీవెన సోషల్ మీడియా ద్వారా తెలుసుకొని చలించిపోయారు. శనివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. తన వంతు సాయంగా రూ.15 వేలు నగదుతోపాటు రైస్ బ్యాగు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యుల పరిస్థితి చూసి కంటతడి పెట్టారు. అధైర్య పడొద్దని, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆమె వెంట ప్రజా ప్రతినిధులు ఉన్నారు.


వెదురుగట్టలో బీజేపీ కార్యకర్త కుటుంబానికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సతీమణి దీవెన

## ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలి


ఎంపీడీవో దివ్యదర్శన్ రావును సన్మానిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు

మానకొండూర్ రూరల్, సెప్టెంబర్ 30: అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ ముద్దసాని సులోచన పేర్కొన్నారు. శనివారం మానకొండూర్ ఎంపీడీవో కార్యాలయంలో మానకొండూర్ నుంచి కరీంనగర్‌కు బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో నీలగిరి దివ్యదర్శన్‌రావుకు వీడ్కోలు సమావేశాన్ని ఎంపీపీ, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ ముద్దసాని సులోచన, జడ్పీటీసీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్ గౌడ్ మాట్లాడుతూ, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేయడంలో ఎంపీడీవో పాత్ర మరువలేనిదని కొనియాడారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు ఎంపీడీవోను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో రాజేశ్వర్ రావు, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈజీఎస్ సిబ్బంది, కారోబార్‌లు, అధికారులు పాల్గొన్నారు.

## కలుపు మొక్కల నివారణపై అవగాహన

రామడుగు, సెప్టెంబర్ 30: మండలంలోని గోలిరామయ్యపల్లి గ్రామంలో నేరుగా వరి విత్తే పద్ధతిలో కలుపు మొక్కలపై సర్వే, అవగాహన కార్యక్రమాన్ని శనివారం జిల్లా ఏరువాక కేంద్రం, కరీంనగర్, వ్యవసాయ శాఖ, అఖిల భారత సమన్వయ కలుపు యాజమాన్య కేంద్రం, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. తర్వాత శాస్త్రవేత్తలు, రైతులు నేరుగా విత్తే వరి పొలాలను పరిశీలించి, అందులో ఉన్న కలుపు మొక్కలను గుర్తించారు. వాటికి సంబంధించిన వివరాలు, రైతులు వాడిన కలుపు మందుల గురించి తెలుసుకున్నారు. రైతులు సరైన కలుపు మందులను సరైన మోతాదులో సరైన సమయంలో పిచికారీ చేసినప్పుడే కలుపును సమగ్రంగా నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో అఖిల భారత సమన్వయ కలుపు యాజమాన్య కేంద్రం, హైదరాబాద్ ప్రధాన శాస్త్రవేత్త డా.పద్మజ, జిల్లా ఏరువాక కేంద్రం, కరీంనగర్ శాస్త్రవేత్త డా.ఎం రాజేంద్రప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి రమేశ్, రైతులు పాల్గొన్నారు.

## స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరనిలోటు

కలెక్టరేట్, సెప్టెంబర్ 30: హరిత విప్లవ పితామహుడు, అంతర్జాతీయ జన్యు శాస్త్రవేత్త డా.స్వామినాథన్ మృతి దేశ వ్యవసాయ రంగానికి తీరనిలోటని జిల్లా విత్తనోత్పత్తిదారుల సంఘం కార్యదర్శి సముద్రాల జనార్దన్‌రావు అన్నారు. నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో శనివారం స్వామినాథన్ సంతాప సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో సరైన పంటలు పండక, విదేశాల నుంచి దిగుబడులు చేసుకుంటున్న క్రమంలో అత్యుత్తమ వరి వంగడాలు సృష్టించి, అన్నార్తుల ఆకలి తీర్చిన గొప్ప శాస్త్రవేత్త స్వామినాథన్ అని కొనియాడారు. ఆయన చూపిన బాటలోనే నేడు దేశీయంగా ఎన్నో కొత్త వంగడాలు సృష్టిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, దేశ కీర్తిప్రతిష్టలను ప్రపంచ దేశాల్లో ఇనుమడింప జేస్తున్నారని పేర్కొన్నారు. అంతకుముందు స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణారావు, కోశాధికారి తిరుపతిరావు, విత్తన ధృవీకరణ సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో నాయకత్వ లక్షణాలు

హుజూరాబాద్‌టౌన్,సెప్టెంబర్30: క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని హుజూరాబాద్ కబడ్డీ క్లబ్ కార్యదర్శి, కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పోటీలకు అండర్– 14 బాల బాలికల 32 జట్లు హాజరు కాగా, బాలుర విభాగంలో మానకొండూర్ జట్టు గెలుపొందగా, సైదాపూర్ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. బాలికల విభాగంలో సైదాపూర్ జట్టు గెలుపొందగా, కరీంనగర్ అర్బన్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. సమావేశంలో ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, పీడీ సొల్లు సారయ్య, ఎస్జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోతన శ్రీనివాస్, రిటైర్డ్ ఎంఈవో ఈ వీరస్వామిగౌడ్, పిజికల్ డైరెక్టర్లు కొన్ని రాజిరెడ్డి, కే వెంకట్‌రెడ్డి, నర్సయ్య, పీ ప్రవీణ్, పీఈటీలు కౌడగాని శ్రీనివాస్, ఇనుముల రవీందర్, వేముల రవికుమార్, శ్రీరుత శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, సౌజన్య, జ్యోతి, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రాల సేకరణ

చొప్పదండి, సెప్టెంబర్ 30: రామడుగు మండలం దత్తోజిపేట గ్రామానికి చెందిన బీనవేణి రాజు రోడ్డు ప్రమాదంలో మరణించగా, అతడి కుటుంబ సభ్యుల అంగీకారంతో చొప్పదండి లయన్స్ క్లబ్ సభ్యులు మృతుడి నేత్రాలను సేకరించారు. హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌కు తరలించారు. పుట్టెడు దుఃఖంలోనూ నేత్రదానం చేసిన రాజు కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ కొల్లూరి జితేందర్ అభినందించారు. కార్యక్రమంలో అడెపు మహేందర్, గోవులకొండ శ్రీధర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.